కథానిక

# శాంత కోరిన శాంతి

భాస్కరమూర్తి

'నాన్నా! ఆ కాగితాల కట్టేమిటి?'

'మీ అమ్మ ఆస్తి.'

'కాగితాలా?'

'అవును- వాటి విలువ నీకు తెలియదు.'

నాన్న అప్పుడే మారిపోయేడు. ఇట్టే ముఖం చిన్నపుచ్చుకుంటాడు. నాన్న ముఖంలో ఈ చంద్రకళ లేమిటో తులసికి అర్థం కాదు.

ఆపుకోలేని కుతూహలంతో—

'అమ్మ ఆస్తి నీ కెందుకు వచ్చింది నాన్నా?''

'మీ అమ్మ ఇవ్వలేదు- నేనే తీసుకున్నాను.'

గొంతుకలో కాఠిన్యం ఉట్టి పడుతోంది. లాలించి, మెప్పిద్దామని గోముగా—

'పెద్దవాళ్ళలా అడక్కుండా తీసుకుంటారా?'—అంది తులసి.

'వెళ్ళి ఆడుకో—' అన్నాడు సమాధానం ఇవ్వలేక.

'అమ్మతో చెపుతానుండు, నువ్వు అమ్మ కాగితాలు తీసుకున్నావని—' అంది కొంటెగా.

గబ గబా వీధిగదిలోంచి వసారాలోకి వచ్చింది తులసి. ప్రక్కఇంటివారి గ్రామఫోను పాట వినిపిస్తోంది. లేడిలా, అటూ ఇటూ తిప్పింది ఆ చిలిపికళ్ళు. ఆ పాట వైపు వెళ్ళింది. అర్థం తెలియకపోయినా, పాటలో ఉన్న సంగీతానికి నాగుబాములా హృదయాన్ని అప్పగించి వింటోంది. నాలుగు నిమిషాల్లో ఫోను ఆపు చేసేరు.

ఆఖరు చరణం పాడుకుంటూ తల్లి దగ్గరకు వచ్చింది.

'నలుగురిలో నన్ను నాణెకాడా
నగుబాటు సేయబోకు సోగ్గాడా!''

కిన్నెర కంఠంతో పాడుతోంది తులసి.

అమ్మను చూసేటప్పటికి, నాన్న చెప్పిన మాటలు జ్ఞాపకానికి వచ్చేయి.

''అమ్మా- నాన్న నీ కాగితాలేం—తీసుకున్నాడే—' అమ్మ చెప్పే సమాధానం వినిపించుకోకుండానే—మళ్ళీ—

''నలుగురిలో నన్ను నాణెకాడా
నగుబాటు సేయబోకు సోగ్గాడా''

అమ్మకి అలాంటి పాటలు విన్నప్పుడల్లా ప్రాణంలో బాణం గుచ్చుకున్నట్లవుతుంది. అవి పూర్వపు గాయాలని రేపుతున్నట్లు బాధపడుతుంది.

'చిట్టీ—ఆ పాట పాడకమ్మా!' అంది గోముగా.

నిండు హృదయంతో అందేమో, అంత భారంగా ఉందా మాట!

'ఏం?'

'మంచి పాట కాదమ్మా—'

'పోనీలే, నాకు నచ్చింది.'

'పంతం పడతావు. అందుకనే...''

'మానేస్తానులే.'

అమ్మ కళ్ళలోని ఆ అమాయకపు బాధని చిట్టి హృదయం భరించలేదు.

'నీ కాగితాలు తెచ్చిపెట్టనా, నాన్న నడిగి?'

'వద్దులే-'

'ఏం?'

'నాన్న దాస్తాడు జాగ్రత్తగా'.

'నాన్న దగ్గర దాచుకున్నావా? నాన్న ఎంత దొంగని-'

తల్లి గట్టిగా హృదయాని కద్దుకుంది చిట్టిని. ఒక్క గంతులో అమ్మ కౌగలిలోంచి, లేడిలాగ, ఎగిరిపోయింది తులసి.

* * *

రాత్రి సమయం. దక్షిణపు దొడ్డిలో అరుగు మీద కూర్చుంది శాంత. దిగులు కళ్లు. అశాంతిలో బాధపడే హృదయం. కృష్ణుని కోసం అన్వే

క్షించే గోపికాంగనలలాగ - తారకలు నక్షత్ర ప్రభువుకోసం కళ్లు కాయలు కాసేలాగ ఎదురు చూస్తూన్నాయి. కనుచూపుమేరలో పంటకు వచ్చిన వరిచేలు...

ప్రకృతిలో ఎటుచూసినా నిరీక్షణ!

'చంద్రుని కౌగిటిలో మొదటిసారి పొందిన ఆ ముద్దులను మళ్లీ ఆ మొయిలుభామ పొంద గలుగుతుందా?'—పిచ్చి ప్రశ్నలు ఆమె హృదయంలో.

హృదయం బాధని భరించలేకపోతోంది.

చెప్పరాని ఆ వేదన. పట్టుదల!

తాను చేసింది ధర్మ విప్లవం — అంటుంది హృదయం!

'కర్తవ్యం'–తన కేమీ—పాలు పోనట్లు చూస్తుంది!

మనసులోని ఉద్రేకాలు మనసులోనే ఉంచుకుని బాధపడుతుంది శాంత.

ఏమి జరగనున్నదో!

"ఏం అలా ఉన్నావేం?" అన్నాడు భర్త, మహేశం- దొడ్డిలోకి ప్రవేశించి.

"ఏం లేదు. ఒకనాడు బాగుంటేగా?"

"విరహవేదన! ఏ మేఘుడూ సహాయం చెయ్యడు-"

"బృహస్పతి అంతవాడికే సమానబుద్ధి లేదు!" చురచుర చూసింది,నీ కెక్కడుంటుం దన్నట్లు.

అతని ప్రతీమాటా ఆమె హృదయాన్ని పెకలిస్తుంది. ఆమె ప్రతీ' జవాబు అతన్ని రెచ్చగొడుతుంది.

"ఈ కాపరం ఎన్నాళ్ళనుంచో ఇలా జరుగుతోంది. అప్సరసలాంటి భార్య, కుబేరుని వంటి భర్త- ఇంకా కాపరంలో సౌఖ్యం లేదంటే అందరికీ ఆశ్చర్యమే!

ఆమె బుద్ధి మంచిది కాదని ఇరుగూ, పొరుగూ అంటారు. సీలివార్తలే కాని, నిజానిజాలు తెలియవు. ఆతనే తెలివితక్కువ వాడనీ- ఏదో మిరపకాయలాగ అంటూ నిక్షేపంలాంటి అమ్మాయిని ఏడిపించుకు తింటాడనీ పెద్దమనుషులందరూ ఆ మొగనీ, ఈ మొగనీ గుసగుసలాడుతునే ఉంటారు.

వీళ్ళందరికీ ఎందుకో వీళ్ళ కాపరం గొడవ! అయినా- ఎవరికి తెలుసు వాళ్ళు, వాళ్ళలోపాలు! ఎంత యుద్ధం చేసినా రాత్రి మాత్రం ఇద్దరూ ఒక పక్కమీదనే చేరతారంటే అందరికీ ఆశ్చర్యమే!

* * *

భళ్లున తెల్లారింది. సంక్రాంతి ముగ్గులు పెడుతున్నారు వీధుల్లో. తులసి చిన్న పట్లు పెడుతోంది. మహేశం వీధి అరుగుమీద పడక కుర్చీలో కూర్చుని ఎదుటింటి కొత్త కోడల్ని దీర్ఘంగా చూస్తున్నాడు. జంగందేవర వచ్చేడు. అతని కూడా ఉన్న కుర్రకుంకకి చారెడేసి కళ్లు, చక్రవర్తి కళ.

తులసి పట్లు మానేసి ఆ కుర్రాడి దగ్గరకు వచ్చి- బియ్యం కావాలా అంటూ లోపలికి వెళ్ళి-దోసెడు బియ్యం తెచ్చి పోసింది.

కుర్రది దానం చెయ్యడం వల్ల, చిన్నదోసిలి మూలాన్ని కొంత మిగిలినా మిగలడమే అనుకున్నాడు మహేశం.

'ఎంత బాగున్నావ్?'- అంటూ చెయ్యి పట్టుకుంది ఆ ముష్టివాణ్ణి.

'ఆడుకుందుకు వస్తావా?'

'మహారాజులు, మాలాంటి నీచకులస్థులతోటి ఏ మాటలు తల్లీ!'అంటూ జంగందేవర కుర్రాణ్ణి తీసుకుని వెళ్ళిపోయేడు.

'తల్లి భాగ్యం అబ్బింది- కులం ఎవరికి కావాలి?'- అన్నాడు మహేశం. మళ్లీ వింత చూపులు!

అలాంటి చూపులు చూస్తాడనే. తులసికి నాన్న అంటే కోపం.

'తండ్రి అసమర్థత, తెలివి తక్కువతనం అబ్బాలి!' కోపంగా అంది శాంత.

అలాంటి విసురులు ఎన్నో అయేయి. ఇంట్లోకి వెళ్ళిపోయేరంతా- పట్లు సగంలోనే ఉండిపోయింది.

'అమ్మా, పూర్తిచెయ్యవే పట్లు—'

'అంతా అసంపూర్తేనే తల్లీ—ఈ జన్మకి పూర్తి లేదు.'

'తల్లి తరవాత పని, నువ్వు పూర్తిచేద్దువుగాని లే'-వెటకారంగా మహేశం.

'ఆ అదృష్టం ఉందేమో!'—అంది శాంత.

* * *

ఎన్నో రాత్రో అది. కాలప్రవాహానికి సమా

సాంతరంగా ఆ జీవిత వాహినులు కొట్టుకుపో తున్నాయి. తులసికి పెళ్లి అయింది. మనుషుల్లో మార్పులు వచ్చేయి—మళ్లీ భార్యా, భర్తా అదే ప్రదేశంలో సమావేశం. ఎన్నాళ్లనుంచో జరుగు తున్న సంఘటనలమీదట — ఒకరంటే ఒకరికి గౌరవం, భయం, ప్రేమ అన్నీ నశించేయి.

'ఆ ఉత్తరా లున్నాయండీ'—భార్య.

'ఎందుకు?'—భర్త.

'తగలేస్తా-'

'నీకట్టైతే నే వాటిని తగలెయ్యాలి—'

'ఆ అదృష్టమే ఉంటే నా కింకేమీ అక్కర లేదు—'

'నీ అదృష్టాన్ని, నీ ముద్దుల కూతురికి తెలియ పరిచి...'

'వాటిమీద మీకేమీ హక్కు లేదు-'

'ఒకదానిమీద ఉండి ఏడుస్తేగా—'

'అవి నేను తీసుకుంటా—'

'చంపేస్తా—అవిచూస్తూ నువ్వు ప్రాణాలు వదలాలి.'

'చంపుతారా?—ఏం మాటలూ...ఆ సాహ సమే ఉంటే ఇంత రభస ఎందుకు?'

'చంపడంలో బాజాకుతనం ఏం లేదు. చచ్చేలా చెయ్యడంలోనే ఉంది గొప్పతనం— నీ పొగరు మోతుతనానికి, నీ కూతురు చెపుతుంది సమాధానం రేపు. చూస్తుందిగా అమ్మ ఆస్తి.'

లోపలికి పోయేడు మహేశం.

ఇంకా అక్కడే ఉంది శాంత.

* * *

తెల్లవారింది. ఎవరి పనులు వాళ్లు చేసుకుం టున్నారు. రాత్రి నిద్రలేదేమో ఇంకా లేవ లేదు మహేశం.

'అమ్మ కనపడదు. ఏమయింది నాన్నా—' అంటూ వచ్చింది తులసి.

తండ్రీ, కూతురూ ఇల్లూ, వీధులూ వెతికేరు. శాంత మాయమయింది.

గబ గబా మహేశం తాళంచెవులు తీసి బీరువా చూసేడు. ఒక్కసారి కుర్చీలో కూలబడి పోయేడు. తులసి బిక్క ముఖంతో బీరువా అరలో చెయ్యిపెట్టి వెతికింది. ఒక ఉత్తరం జారి పోయింది. దొరికింది. తులసి చదివింది- కొంచెం పైకే.

ప్రియా!

హృదయం ఒకచోట, శరీరం ఒకచోట. ఇంక నిలవలేను. రాత్రుల మధుర స్వప్నాలు - నిజమా అనిపిస్తాయి పగలు. రాత్రి నీ నోటినుంచి విన్న తీయని పలుకులు నెమరువేసుకుంటూ - చిరునవ్వుతో గడుపుతా. పక్కవాళ్ల కేం తెలు స్తాయి ఈ చిరునవ్వుల పూర్వ గాథలు?

కుల మతాలు పాటించని పవిత్రప్రేమ మనది. పుష్పంతో జయంపొందిన విజయుణ్ణి.

నల్లత్రాచుతో చెలగాటాలు నీ మొదటి పరి చయం—హృదయాల కలయికకు ఊకొట్టిన నీ బుద్ధి, శరీరాన్ని తాకడానికి అన్ని శరద్రా త్రులా?

"ఇలా పరాయివాడితో..." అని వేళా కోళంగా అన్న ముక్కకు—

"ధర్మవిప్లవం!" అన్న సమాధానం జ్ఞాపకం వస్తుంది.

"తెలివిమాలిన భర్తకు శరీరపుకట్టె—నీకు సంపూర్ణ హృదయం నీరాజనం ఇస్తుంది—" అబ్బా! మరవగలనా?

"మరి ఇలాదాకి వచ్చేటప్పుడు నేను పట్టు బడితేనో!" అన్న నా మాటకు—

భుజంమీద వేసిన పమిట చెంగు పొగ్గా తీసి, పీకచుట్టూ చుడుతూ—

"ఇలా ముడి పడిపోతుంది—క్షంతే!"

ఎంతధైర్యం?

కలియుగ తారవు—

మళ్ళీ రాత్రి......

పగలు గడపడం చాలాభారం అయిపోతోంది. ఇంతట్లోకే ఈ ఉత్తరం ఎందుకంటావేమో!

ఏమిటో—పిచ్చివాణ్ణి!

నీ

చంద్రుడు

ఉత్తరం పూర్తి చేసి నిర్ఘాంతపోయింది తులసి.

'నాన్నా—అ... మ్మ ..." అని కళ్ళంట నీళ్లు కార్చింది.

'అవును, మీ నాన్న కుటుంబగౌరవంకోసం అన్నీ అణచిపెట్టి ఊరుకున్నాడు. వాడిదగ్గరకే ఆ ఉత్తరాలు పట్టుకునిపోయి ఉంటుంది...ఇంక మనకూ దానికీ-అంతే.'

అమ్మ క్షమింపరాని దనుకుంది తులసి-

తన చేతులతో నేనా చంపేనుగా నను కున్నాడు మహేశం.

ఎన్నాళ్లనుంచో ఈ వార్త విందామని కుతూహల పడుతున్న ఇరుగుపొరుగువాళ్ళ సంతోషానికి మేరలేదు.

తెల్లవారుజాము గడియలు. ఒంటరిగా వెడుతోంది శాంత. హృదయం కొట్టుకుంటోంది. ఈ జీవితవాహిని ఎడారిలో ఇంకిపోవాలో, స్వచ్ఛ సరస్సులో లీనమవాలో! ముందు జీవితపు వైఖరి, కొన్ని నిమిషాల్లో తేలిపోతుంది.

ఐదుమైళ్ళ ప్రయాణం చేసింది. శరీరం నీర సించింది. చంద్రుడు తన సింహాసనాన్ని ఖాళీ చెయ్యడానికి తొందరపడుతున్నాడు. ఇంక గంటలో తెల్లవారుతుంది. బెదురుతో ఒక తలుపుముందు ఆగిపోయింది. అదే చంద్రుని ఇల్లు! గుమ్మంలో తీసిపారేసిన మల్లిమొగ్గల దండ వాడిపోయింది. తన్ని వెక్కిరిస్తున్నట్లు ఉంది! పక్కనున్న చెట్టుమీద నందివర్ధనం పువ్వుచుట్టూ రొద చేస్తూ ఆడుకుంటోంది తుమ్మెద.

'వాడిన పువ్వుకేసి తుమ్మెద చూడదు—' అంటోంది హృదయం.

ప్రకృతి ధర్మం అంతా మోసమేనా?

నా చంద్రుడు అలాంటివాడు కాదు—సమాధాన పరుచుకుంటోంది శాంత.

ఒక నిమిషం మేడవైపు చూసింది.

ఏదో సన్నని గొంతుక, మువ్వల మ్రోతలూ వినిపిస్తున్నాయి.

చంద్రుడు రసికుడు. అందుకనే వలచింది తను. తనకు ఆశ్రయమిస్తాడా?

వెళ్ళిపోతా... ఈ సమయంలో...లాభం.. అనుకుని వెనక్కు బయలుదేరింది.

'ఎక్కడకు వెడతావు?'-లోపల నుంచి ప్రశ్న.

'పవిత్రప్రేమ నీది- నిన్ను ఆదరిస్తాడు" ఎక్కడనుంచో ధైర్యం.

మళ్ళీ ఇంటి గుమ్మం దగ్గర ఆగిపోయింది. ఏమని పిలుస్తుంది? తొందరపడాలి, తెల్లవారవచ్చింది.

సాహసించి తలుపు తట్టింది శాంత. ఏం అదృష్టమో! లోపలనుంచి యువతులకు వచ్చి డాబామీద నిలబడి చూస్తున్నాడు చంద్రుడు. చూసిన ముఖం. అందులో ఆడది. సరిగా అనడం లేదు. సరాసరి మేడమెట్లు దిగి వచ్చేడు చంద్రుడు.

'చందూ! నేనూ శాంతని'...

'ఓహో నువ్వా! ఏం భర్తగారు సాగనంపేరా- ఇలా వచ్చేవు? మహాసావిత్రిలా సంచరించేవులే—'

'భర్త సాగనంప లేదు. బిడ్డ కాపరానికి వెళ్ళింది. ఇంక నా రాజుదగ్గరకు నే వచ్చా—'

'దాన్ని కూడా తీసుకురాపోయావా? చాలా అందంగా ఉంటుందిటగా- ముప్ఫయి ఏళ్ళ ముసలమ్మవు నువ్వెందుకు?'

వాడిన ఆ మల్లిమొగ్గల దండ సానుభూతితో చూస్తోంది, 'ప్రకృతి ధర్మమే ఇంత' అన్నట్టు.

ఆవేశాలు సముద్రపు టలల లాంటివి. ఆ నిమిషంలో అనంతాన్నే ఐక్యం చేసుకోవాలన్న ప్రయత్నం, ఆశ. మరుక్షణంలో పతనం, చప్పగా చల్లారిపోవడం! ప్రేమ, మంచి, చెడ్డ- అన్నీ క్షణికావేశాలే నేమో!

అనంతమైన ప్రేమ లోకంలో కరువేమో!

అనలేక, అనలేక—

'ఛీ - ఏం మాటలూ?'

'వేశ్యకి వ్యభిచారంఅంటే అసహ్యంట!'

'నోరు ముయ్యి. నాదే పాపం. ఎలా ఏడ్చినా ఆ మొగుడికే చెల్లింది-"

కళ్ళంట నీళ్లు కారేయి.

ఏం చెయ్యడానికి తోచదు...

దారి లేదు, తెన్ను లేదు.

ఆ ఎడబాటును భరించలేక లోపలున్న యువతి డాబామీదకు వచ్చి-'అబ్బా! రద్దురూ-' అంటోంది.

రెండో యువతి- 'వారెవరే!' అంటూ ఆమె భుజాలమీద చేతులు ఆని చూస్తోంది.

ప్రేయసి ఆజ్ఞానుసారం, చంద్రుడు మేడ మెట్లు ఎక్కుతున్నాడు గబ గబా.

"నలుగురిలో నన్ను నాణెకాడా

నగుబాటు సేయబోకు సోగ్గాడా!"

అంటూ కళ్ళు చిలిపిగా తిప్పుతూ, శాంత కేసి చూసి పాడి ఒక నవ్వు నవ్వింది మొదటి యువతి.

చంద్రుడి నవ్వు ఆ యిద్దరి యువతుల కంఠంలో కలసిపోయింది—